క్లుప్తంగా

బంగారుకొండ కిట్ల పంపిణీ


కిట్లను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్లు

నిడదవోలు: పేదరికం వల్ల పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయడానికి ప్రభుత్వం బంగారుకొండ పథకాన్ని అమలు చేస్తోందని కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీనివాస్, ఆకుల ముకుందరావు అన్నారు. ఒకటో వార్డు బాలాజీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ముగ్గురు చిన్నారుల తల్లులకు బంగారుకొండ కిట్లను వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు లక్ష్మణరావు, వి.శంకురం, పి.ఉదయ అనూష, అంగన్‌వాడీ కార్యదర్శి షేక్ జరీనా బేగం, వలంటీర్లు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ద్వారా అంతర్జాతీయ స్థాయి సేవలు


ప్రభుత్వ హైస్కూల్లో ఎలక్ట్రికల్ వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొల్లేపర కృష్ణాజీ

కొవ్వూరు: జాతీయ, అంతర్జాతీయ స్థాయి సేవా కార్యక్రమాల ద్వారా వాసవీ క్లబ్ గుర్తింపు పొందిందని ఆ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొల్లేపర కృష్ణాజీ అన్నారు. ఆయన శనివారం కొవ్వూరు పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వాసవీ క్లబ్ బహూకరించిన ఎలక్ట్రిక్ వాటర్ కూలర్‌ను ఆయన ప్రారంభించారు. మద్దుల సత్యనారాయణ ఆర్థిక సహకారంతో ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన తల్లి పాలు పట్టించే క్యాబిన్‌ను ప్రారంభించారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.వాసవీ క్లబ్ అధ్యక్షుడు తీగెల రవి, కార్యదర్శి నాగుబండి ఫణి, కోశాధికారి చొక్కా గౌతమ్, వనిత క్లబ్ అధ్యక్షురాలు మద్దుల వెంకటలక్ష్మి, కార్యదర్శి నాగుబండి దివ్య, కోశాధికారి గ్రంధి సంజన, జిల్లా ఉప గవర్నర్ కేదారశెట్టి రవి, రీజియన్ చైర్మన్ మానేపల్లి రమణ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు, వలివేటి ప్రసాద్, బంగారు కాశీ అన్నపూర్ణ, మద్దుల సత్యనారాయణ, కొల్లేపర శ్రీనివాస్, సత్యవరపు భరత్ పాల్గొన్నారు.

26,27 తేదీల్లో స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశానికి ఎంపిక పోటీలు

కొవ్వూరు: కడపలోని వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశానికి రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 26, 27 తేదీల్లో విద్యార్థులకు ఎంపిక క్రీడా పోటీలు నిర్వహిస్తారని ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. 8 నుంచి పదేళ్ల లోపు వయస్సు గల 4,5 తరగతుల విద్యార్థులు స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశానికి అర్హులన్నారు. కొవ్వూరు మండలం, పురపాలక సంఘం పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ వివరాలను కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో నమోదు చేయించుకోవాలన్నారు. ఎంపిక పోటీలకు వెళ్లే విద్యార్థులు తమ ఆధార్ నంబర్, జనన ధృవీకరణ పత్రాలు తీసుకెళ్లాలని సూచించారు. వివరాల కోసం జిల్లా సెలక్షన్ కమిటీ సభ్యులైన నాగరాజు పీడీ -99637 53246, పీడీ రాజేంద్ర-97040 31202 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

27న మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు: కొవ్వూరు మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని ఈనెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు చైర్‌పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు. పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశంలో సమీక్షిస్తామన్నారు.

పరామర్శలు

నిడదవోలు రూరల్: డి.ముప్పవరంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ముప్పిడి నాగయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు పరామర్శించారు. అలాగే శస్త్రచికిత్స చేయించుకున్న బేతాళ శ్రీనివాస్ ఆరోగ్య వివరాలు ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.

వాదాలకుంటలో జగనన్న సురక్ష

దేవరపల్లి: గోపాలపురం మండలం వాదాలకుంట గ్రామంలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. జూలై 30 వరకు గ్రామాల్లో కార్యక్రమం జరుగుతాయన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పరిష్కారం కాని సమస్యలను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పరిష్కారం అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, సర్పంచ్ జొన్నకూటి మణెమ్మ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఉప్పలపాటి చినఅబ్బులు, తహల్దార్ రవీంద్రనాథ్, ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి, పార్టీ నాయకులు ఎస్‌కే ఖాదర్‌వల్లీ, కూసం రామ్మోహన్‌రెడ్డి, ఉండవల్లి సోమశేఖర్, గెడా అమ్మన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖర్చు లేకుండా.. ఇంటికే వైద్యం

- తీరిన పేదల హెల్త్ కష్టాలు
- ఫ్యామిలీ డాక్టర్‌తో మండలంలో 52 వేల మందికి వైద్యం
- ఆనందం వ్యక్తం చేస్తున్న సుగర్,బీపీ వ్యాధిగ్రస్తులు
- మెరుగుపడిన ఆరోగ్యశ్రీ సేవలు

పెరవలి: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్, కంటి వెలుగు, వైఎస్సార్ ఆసరా, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు పేదలకు వరంలా మారాయి. గతంలో సామాన్యుడికి ఏ చిన్న జబ్బు చేసినా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పట్టణాలకు పరుగు పెట్టాల్సిన పరిస్థితి. కానీ ఇప్పుడా అవసరం లేదు. ఫ్యామిలీ డాక్టర్ పథకం అమల్లోకి వచ్చాక నెలకొక సారి వైద్య బృందం గ్రామాలకే వచ్చి రోగులకు పరీక్షలు చేసి, వారికి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా పెరవలి మండలంలోని 18 గ్రామాల్లో ఇప్పటివరకూ 205 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 52,054 మందికి సేవలు అందించారు. ఇక సుగర్, బీపీ రోగులకు నెలవారీ వైద్య పరీక్షలు, మందుల కొనుగోలు భారం తగ్గింది. ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించే 104 వాహనంలోనే ప్రతి నెలా వారికి పరీక్షలు చేసి, ఉచితంగా నెలకు సరిపడా మందులు ఇస్తున్నారు. మండలంలో 9,273 మంది సుగర్, బీపీ రోగులకు ఈ సేవలు అందుతున్నాయి. తమకు వ్యాధి సోకినా, చేతిలో సొమ్ములు లేకపోయినా, అందుబాటులో ప్రభుత్వం ఉందిలే అన్న ధీమా ప్రజల్లో ఏర్పడింది.

గర్భిణులకు వైఎస్సార్ ఆసరా : జగన్‌మోహన్‌రెడ్డి ప్ర భుత్వం మెరుగుపరిచిన మరో పథకం వైఎస్సార్ ఆస రా. గతంలో ప్రభుత్వాసుపత్రిలో పురుడు పోసుకున్న గర్భిణికి ప్రోత్సాహకంగా కేవలం రూ.1300 ఇచ్చేవా రు. ప్రస్తుత ప్రభుత్వంలో పురుడు పోసుకున్న మహిళకు రూ.4 వేల నగదు సాయం చేయడమే గాకుండా, తల్లీబిడ్డలను ప్రభుత్వ వాహనంలోనే ఇంటికి చేరుస్తున్నారు. ఇప్పటి వరకూ ఈ పథకంలో మండలంలో 3100 మంది మాతృమూర్తులకు రూ.1.24 కోట్ల సా యంగా అందించారు. అంతేగాకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కంటి వెలుగు పథకం ద్వారా గ్రామాలకు వచ్చి చిన్నారులకు, వృద్ధులకు ఉచితంగా నేత్ర పరీక్ష లు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కళ్లజో ళ్లు కూడా ఇస్తోంది. ఈ పథకం ద్వారా మండలంలో 13,881 మందికి పరీక్షలు నిర్వహించి, వారిలో 1318 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు.


నడుపల్లి గ్రామంలో దీర్ఘకాల రోగి ఇంటికి వెళ్ల వైద్యం చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ బృందం


ఉసులుమర్రులో బాలింతను, బిడ్డను పరీక్షిస్తున్న డాక్టర్ తేజశ్రీ

ఆదుకొంటున్న ఆరోగ్యశ్రీ

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని గత తెలుగుదేశం ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ఈ పథకం ద్వారా కేవలం కొన్ని రకాల వ్యాధులకే నిధులు మంజూరు చేసేది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఈ నాలుగేళ్లలో ఈ పథకం ద్వారా మండలంలో రూ.12.91 కోట్లు ఖర్చు చేసి 6,095 మంది ప్రాణాలు నిలిపింది. చంద్రబాబునాయుడి ప్రభుత్వం కేవలం 1046 వ్యాధులకే ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేస్తే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఏకంగా 3,252 వ్యాధులకు ఆరోగ్యశ్రీ వైద్య సేవలను పెంచారు.టీడీపీ ఐదేళ్ల పాలనలో ఆరోగ్యశ్రీలో మండలంలో 3,250 శస్త్ర చికిత్సలు చేస్తే ప్రస్తుత ప్రభుత్వంలో 6,095 మందికి ఈ నాలుగేళ్లలో శస్త్ర చికిత్సలు చేశారు.

ఆయుర్ధాయం పెరుగుతోంది


ప్రతినెలా వైద్య బృందం గ్రామాలకు వచ్చి రక్త, మూత్ర పరీక్షలు చేసి, మందులు ఇస్తున్నారు. వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లే అవసరం లేకుండా పోయింది. ఫ్యామిలీ డాక్టర్‌తో మా ఆయుర్ధాయం పెరిగింది. ముఖ్యమంత్రి జగన్‌కు ధన్యవాదాలు.
–కొవ్వలి అమ్యుతరామయ్య, మునిపల్లి

మెరుగైన వైద్యం


నేను సుగర్ వ్యాధిగ్రస్తురాలిని. కుటుంబసభ్యులు ప్రతి నెలా తణుకు తీసుకువెళ్ళేవారు. ఇంటి ఖర్చులు తగ్గించుకుని, ఆ సొమ్మును నా వైద్యానికి ఖర్చు చేసేవారు. ఫ్యామిలీ డాక్టర్ వచ్చాక, ప్రతి నెలా వైద్యులు, సిబ్బందికి ఇంటికే వచ్చి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు ఇస్తున్నారు. నా వైద్యం నా కుటుంబానికి ఇప్పుడు భారం కావడం లేదు. –హనుమంతు ఝాన్సీ, కానూరు అగ్రహారం

గర్భిణులకు అద్భుతమైన సేవలు


ప్రభుత్వాసుపత్రిలో ప్రస్తుతం గర్భిణులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. గర్భం దాల్చినప్పటి నుంచీ ప్రసవానంతరం తల్లీబిడ్డలను ఇంటికి చేర్చే వరకూ ఎంతో బాధ్యతగా వైద్యం అందిస్తున్నారు. అదీ ఒక్క రూపాయి ఖర్చు లేకుండా.
–కావకాదేవి ప్రసన్న, కానూరు

రోగుల వద్దకే వైద్యం


గ్రామీణ ప్రాంతాల వారికి కూడా మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నాం. గ్రామాల్లోని విలేజి హెల్త్ క్లినిక్‌ల ద్వారా వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, సూపర్ వైజర్లు, ఆశ వర్కర్లు అందుబాటులో ఉన్నారు. సాధారణ వ్యాధిగ్రస్తులకే గాకుండా సుగర్, బీపీ రోగులు గర్భిణుల వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం.
–పి తేజశ్రీ , వైద్యాధికారి, కానూరు పీహెచ్‌సీ

పీఎం కిసాన్ పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరి

ఉండ్రాజవరం: పీఎం కిసాన్ సమ్మాన్ పొందాలంటే రైతులు ఈ నెల 28వ తేదీలోగా విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో ఎం.విశ్వాసరావు శనివారం తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లోనూ, మొబైల్‌లో పీఎం కిసాన్ వెబ్‌సైట్, కామన్ సర్వీసు సెంటర్లల్లో ఈకేవైసీ చేయించుకోవచ్చన్నారు. పెట్టుబడి సాయం క్రింద ప్రభుత్వం మూడు విడతలుగా మొత్తం రూ.6 వేలను రైతుల ఖాతాల్లో ఏటా జమ చేస్తుందన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

నిడదవోలు: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఈబీ సీఐ కె.వీరబ్రహ్మం సూచించారు. డ్రగ్ రహిత ఇండియా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శశి జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. వీరబ్రహ్మం మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలు అయితే వారి శక్తి సామర్థ్యాలు నిర్వీర్యం అవుతాయన్నారు. డ్రగ్స్ మాఫియాను పూర్తిగా నిరోధించడానికి ప్రభుత్వం, పోలీస్ శాఖ తీవ్రంగా కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్సై ఆర్‌వీ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫస్టియర్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

కొవ్వూరు: ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి జూలై 7 నుంచి 12 వరకూ ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్టు స్థానిక ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వీ సుబ్బారావు శనివారం తెలిపారు. డిగ్రీ ఫస్టియర్‌లో చేరాలనుకునే విద్యార్థులు నేరుగా కళాశాలలో సంప్రదించాలని కోరారు. ఆన్‌లైన్‌లో ఫస్ట్ అడ్మిషన్‌ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను జూలై 7వ తేదీ వరకూ తొలుత ఇచ్చారన్నారు. దీనిని 12వ తేదీ వరకూ పొడిగించారని తెలిపారు.

పథకాల లబ్ధి పొందని అర్హుల గుర్తింపు

- అందుకే జగనన్న సురక్ష కార్యక్రమం
- గోపాలపురం ఎమ్మెల్యే తలారి
- అధికారుల బృందంతో కలసి తెలికిచర్లలో పర్యటన

నల్లజర్ల: అర్హులందరూ ఆయా పథకాల ద్వారా లబ్ధి పొందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ ఎం.రాజశేఖర్ బృందంతో కలసి ఎమ్మెల్యే శనివారం తెలికిచెర్ల గ్రామంలో ఇంటింటికీ పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని ప్రజలను ఆరా తీశారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ నెలాఖరు వరకు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారులు ప్రజా ప్రతినిధులతో కలసి ప్రతి ఇంటినీ సందర్శిస్తారన్నారు. అర్హత ఉండి లబ్ధి పొందనివారు ఎక్కడైనా ఉంటే గుర్తిస్తారన్నారు. తహసీల్దారు, ఈఓపీఆర్డీలతో కూడిన ఒక బృందం, ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్‌లతో కూడిన మరో బృందం సచివాలయాల వారీగా క్యాంపులు నిర్వహించి అక్కడికక్కడే ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో తెలికిచెర్ల సర్పంచ్ బండి చిననాగరాజు(చిట్టి) నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


తెలికిచెర్లలో ఇంటింటికీ వెళ్ల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నిడదవోలు: అర్హులందరికీ పథకాలు అందించమే జగనన్న సురక్ష లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలో జూలై 1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ప్రతి సచివాలయంలో క్యాంపుల నిర్వహణలో భాగంగా ఇంటింటి సర్వేకు శనివారం ఆయన వలంటీర్ల యాప్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, కౌన్సిలర్ కామిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


నిడదవోలులో వలంటీర్ల యాప్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

ఉండ్రాజవరం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండలంలోని చివటం గ్రామంలో ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు శనివారం ప్రారంభించారు. గ్రామంలో గడప గడపకూ వెళ్ళి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకారణం చేతనైనా అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు అందకపోతే ఈ కార్యక్రమంలో తెలియజేయాలన్నారు. ఎలాంటి సేవా రుసుములు లేకుండా 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ప్రజలకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కరుటూరి పద్మావతి, హౌసింగ్ ఏఈ విక్టర్ బాబు, వీఆర్వో రాజశేఖర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీటికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- జల్‌జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన

నిడదవోలు రూరల్: రాష్ట్రంలో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా మండలంలోని సమిశ్రగూడెంలో రూ.70.69 లక్షలు, డి.ముప్పవరంలో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించే ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌ల నిర్మాణం, తాగునీటి కుళాయిలు, పైపులైన్ పనులకు ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నాలుగేళ్లలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులకు పెద్దపీట వేశామన్నారు. పేదలకు ఇళ్లస్థలాలు, ఇళ్లు మంజూరు చేయడంతో పాటు వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. మళ్లీ మోసపూరిత హామీలతో ఓట్లు అడిగేందుకు వస్తున్న టీడీపీ నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, సర్పంచులు దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, నాగిరెడ్డి నాగదేవి, కారింకి అన్నవరం, వెలగన నరేష్, ఎంపీటీసీ సభ్యులు సంగినీడి సత్యనారాయణ, అంగర ఝాన్సీరాణి, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీడీఓ పి.శామ్యేలు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ టి.శ్రీనివాస్‌బాబు, ఏఈ కె.శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సమిశ్రగూడెంలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

సకాలంలో బిల్లులు చెల్లింపునకు చర్యలు

జగనన్న గృహ లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకున్నట్టు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. రావిమెట్ల గ్రామంలోని జగనన్న లే అవుట్‌లో చాపల ఝాన్సీ, గెద్దం విజయలక్ష్మి అనే ఇద్దరు లబ్ధిదారుల గృహాలకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత, సర్పంచ్ కాల్దారి సూర్యకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉప్పులూరి రామకృష్ణ, మిద్దే శ్రీను, కాల్దారి శ్రీను పాల్గొన్నారు.

నాడు పడిగాపులు .. నేడు ఇంటికే పింఛను

ఇది కదా పాలనలో మార్పు అంటే...

కొవ్వూరు: తెలుగుదేశం పార్టీ హయాంలో పింఛను సొమ్ము తీసుకునేందుకు లబ్ధిదారులు ప్రతి నెలా పడరాని పాట్లు పడాల్సి వచ్చేది. నడవలేని స్థితిలో ఉన్నప్పటికీ వృద్ధులు, వికలాంగులు పంచాయతీ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. వేలిముద్రలు పడడం లేదని, బయోమెట్రిక్ యంత్రాలు సక్రమంగా పనిచేయడం లేదని, ఇంకా పింఛను సొమ్ములు అందలేదంటూ సిబ్బంది పదేపదే తిప్పుకునే వారు. ఇచ్చే కొద్ది మొత్తం కోసం గంటల తరబడి పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఉండేది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక వలంటీర్ వ్యవస్థను పింఛనుదారులవే గాకుండా పేదల కష్టాలకు చెక్ చెప్పారు. వలంటీర్ల ద్వారా ఒకటో తేదీన తెల్లవారక ముందే లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి పింఛన్లు అందిస్తున్నారు. లబ్ధిదారులు ఎక్కడైనా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ లేవలేని స్థితిలో ఉంటే వలంటీర్లు శ్రమ అనుకోకుండా అక్కడికి కూడా వెళ్లి పింఛను అందిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం రూ.వెయ్యి చొప్పున అందించిన పింఛను సొమ్మును 2019 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రూ.2 వేలు చేసింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే పింఛను సొమ్మును నాలుగు విడతల్లో రూ.3 వేలకు పెంచుతామని జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అందుకనుగుణంగా పింఛనును ఏడాదికి రూ.250 ల చొప్పున పెంచుతూ ప్రస్తుతం ఒక్కొక్కరికి రూ.2,750 చొప్పున పింఛను అందిస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి ఏకంగా రూ.3 వేల చొప్పున అందించనున్నారు. అంతేగాకుండా పార్టీ రహితంగా అర్హతనే ప్రామాణికంగా తీసుకుని ప్రతి ఆరు నెలలకొకసారి కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నారు. ఎంత మంది అర్హులైతే, అంతమందికీ పింఛను ఇస్తున్నారు. ఇది కదా పాలనలో మార్పు అంటూ జనం నీరాజనాలు పడుతున్నారు. పింఛనుదారుల కష్టాలకు చెక్ పడడంతో ఆనందం వ్యక్త పరుస్తున్నారు. టీడీపీ హయాంలో రూ.75 ఉండే పింఛను సొమ్మును దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో రూ.200కు పెంచారు. ఆయన మరణానంతరం వచ్చిన అప్పటి కాంగ్రెస్ సీఎం కె.రోశయ్య పాలనలోను పింఛనుదారులకు ఇచ్చే సొమ్ము కోసం బ్యాంకు ఖాతాలు తెరవాలని మెలిక పెట్టారు. దీంతో 2011 మార్చి 10న పింఛనుదారులు కొవ్వూరు మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో పింఛనుదారులకు ఇలాంటి కష్టాలేమీ లేకుండా ఇంటికే పింఛను అందిస్తున్నారు.


2016 మే 7న చాగల్లు పంచాయతీ ఆఫీసు వద్ద పింఛన్ల కోసం లబ్ధిదారుల పడిగాపులు (ఫైల్)


ఆసుపత్రికి వెళ్ల చికిత్స పొందుతున్న పింఛనుదారుకు సొమ్ము అందిస్తున్న వలంటీర్ (ఫైల్)


2011 మార్చి 10న కొవ్వూరు మునిసిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వృద్ధులు, పింఛనుదారులు (ఫైల్)

ఘనంగా హోం మంత్రి వనిత పుట్టిన రోజు వేడుక


మంత్రి వనితకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీ భరత్‌రామ్


కొవ్వూరులో దివ్యాంగురాలికి వస్త్రాలు అందజేస్తున్న మంత్రి వనిత


అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర ఏర్పాటు చేసిన 50 కిలోల కేక్ కట్ చేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పుట్టిన రోజు వేడుకలు శనివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కుటుంబ సభ్యుల సమక్షంలో శుక్రవారం అర్ధరాత్రి మంత్రి కేక్ కట్ చేశారు. మంత్రికి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతూ పట్టణంలో భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. బాణసంచా కాలుస్తూ, తీన్‌మార్ డప్పు వాయిద్యాలతో కోలాహలంగా మంత్రి వనిత పుట్టిన రోజు వేడుకలు జరిపారు. పార్టీ నాయకులు, అధికారులు, అభిమానులు తీసుకొచ్చిన కేక్‌లను మంత్రి కట్ చేసి వారితో ఆనందాన్ని పంచుకున్నారు. మంత్రి తండ్రి, మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావు, సోదరుడు విజయ్‌కుమార్, సోదరి సునీత, ఇతర కుటుంబ సభ్యుల సమక్షంలో తొలుత వనిత కేక్ కట్ చేశారు. శనివారం రాత్రి పట్టణంలో సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్ ప్రాంగణంలో కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 50 కిలోల భారీ కేక్‌ను మంత్రి వనిత కట్ చేశారు.దివ్యాంగులకు వస్త్ర అన్నదానాలు చేశారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివ రామకృష్ణ, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, వైస్ చైర్ పర్సన్‌లు మన్నె పద్మ, గంధ్రోతు అంజనీదేవి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, పార్టీ రాజమహేంద్రవరం రూరల్ కో-ఆర్డినేటర్ చందన రమేష్, పార్టీ నాయకులు ఆత్కూరి దొరయ్య, చౌటుపల్లి వీరన్న, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు బండి పట్టాభిరామారావు, వల్లభశెట్టి శ్రీనివాస్, ఎంపీపీలు కాకర్ల నారాయుడు, జొన్నకూటి పోసిరాజు, మట్టా వీరాస్వామి, పలువురు పార్టీ నాయకులు, డీఆర్‌డీఏ పీడీ సుభాషిణీ, డీపీవో జానా సత్యనారాయణ, డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎస్‌జీటీ సత్యగోవిందు, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి డి.పరశురామ్ తదితరులు మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.